

సీఎం సిద్దరామయ్యకు గౌరవ డాక్టరేట్

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): కోలారు దేవరాజ్ అరసు అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ (దేవరాజ్ అరసు యూనివర్సిటీ) సీఎం సిద్దరామయ్యకు సామాజిక సేవా విభాగంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. యూనివర్సిటీ 15వ స్నాతకోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వైస్‌చాన్స్‌లర్ జీహెచ్ నాగరాజ్ ప్రకటించారు. సిద్దరామయ్య రెండోసారి సీఎంగా సేవలందిస్తున్నారని, 16సార్లు రాష్ట్రబడ్జెట్ ప్రవేశపెట్టారని అందుకే గౌరవ డాక్టరేట్‌ను ఇస్తున్నామన్నారు. కోలారు పర్యటనకు వచ్చినప్పుడు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తామన్నారు.

సంబరాలకు.. వేళాయె..!





- కాంగ్రెస్ పాలనకు రెండేళ్లు
- 20న వేడుకలకు ఏర్పాట్లు
- విభేదాలున్నా సాఫీగానే పాలన
- విస్తరణపై పెరుగుతున్న ఆశలు

బెంగళూరు, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సిద్దరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మరికొన్ని రోజుల్లోనే రెండేళ్లు పూర్తి కానుంది. చిన్నా, చితక ఆటుపోట్లు మినహా సర్కారు 'గ్యారెంటీ'లతో సజావుగా సాగింది. కొన్ని నెలలుగా మంత్రివర్గ విస్తరణ అంశంపై ప్రస్తావనలు వచ్చినా అవి తుదిదశ దాకా చేరలేదు. బెంగళూరులో ప్రారంభమైన కేబినెట్ విస్తరణ చర్చలు ఢిల్లీదాకా వెళ్లేందుకే పరిమితమయ్యాయి. సీఎం సిద్దరామయ్య ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి విస్తరణపై అధిష్ఠానంతో చర్చించి ఓ నిర్ణయంతో వస్తారనే ప్రచారం సాగింది. రాజు వెడలె తరహాలో.... సిద్దరామయ్య హస్తినకు బయల్దేరిన ప్రతిసారి ఆశావహులు కూడా రెండు డజన్లమంది పరుగెత్తేవారు. చివరికి ఉసూరుమంటూ వెనుదిరిగేవారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి బీ నాగేంద్ర అవినీతి వివాదంలో రాజీనామా మినహా మిగిలిన వారంతా యథావిధిగా ఉన్నా రు. ఏడాది పాలన ముగియగానే విస్తరణ ఉంటుందనే చర్చ జరిగింది. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలు ముగియగానే... అనే చర్చ హల్‌చల్ చేసింది. సీఎం సిద్దరామయ్య కాలినొప్పితో మూడు నెలలు పాటు బెంగళూరు వీడలేదు. గత నెలలో కర్ణాటక భవన్ ప్రారంభానికి వెళ్లినప్పుడు విస్తరణ అంశం కొలిక్కి తెస్తారని భావించారు. వీటన్నింటికంటే ఈ ఏడాది ప్రారంభం రోజునే డీసీఎంతో సంబంధం లేకుండా మంత్రుల విందు సాగింది. అదికాస్త అధిష్ఠానం వద్ద చర్చకు వెళ్లింది. ఆ తర్వాత మరిన్ని విందులు జరుపుకోవాలనే సిద్ధమైనవారికి అధిష్ఠానం షాక్ ఇచ్చింది.

సర్దుకుపోతున్నారు..!

రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య విబేధాలు తీవ్రమైన తరుణంలో అధిష్ఠానం నుంచి కేసీ వేణుగోపాల్ బెంగళూరుకు వచ్చి లెజిస్లేచర్ భేటీ జరిపి తీవ్రస్థాయిలో మందలించారు. విబేధాలు కొనసాగిస్తే మంత్రివర్గ ప్రక్షాళన చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి చిన్నపాటి ఆటుపోట్లు రెండేళ్లలో ఎన్నో సాగాయి. మరో మూడేళ్లు మాత్రమే అధికారం ఉంటుంది. ఈలోగానే మేము సైతం మంత్రులు కావాలనుకునేవారు పెరుగుతున్నారు. దశాబ్దాలుగా మంత్రులు గా కొనసాగుతున్న కొందరిని పక్కనపెట్టి కొత్తవారికి అవకాశం ఇవ్వాలనే డిమాండ్ అధికమవుతున్నాయి. పార్టీలో అంతా సమైక్యమని చెప్పుకొంటున్నా గ్రూపు విబేధాలు ఉన్న విషయం అధిష్ఠానం కూడా గుర్తించింది. సీఎం, డీసీఎంలతోపాటు ఖర్గే మద్దతుదారులు కూడా అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు.

కొందరికి ఉద్వాసన తప్పదా..?

రాష్ట్ర కేబినెట్‌లో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు కొందరు మంత్రులు మాత్రమే వారిశాఖలపై పట్టు సాధించారు. నిరంతరం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ పత్రికల్లో పతాకశీర్షికల్లో కనిపిస్తున్నారు. రెండేళ్ల వ్యవధిలో ఒక్కసారి కూడా వారిశాఖపై సమగ్రత సాధించనివారిని పక్కన పెట్టాలనే డిమాండ్ పెరుగుతున్నాయి. క్రియాశీలకం లేని కనీసం పదిమంది మంత్రులను పక్కన పెట్టాలనేది పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇలా తొలగిస్తే కొత్తవారికి చోటు లభించనుంది. రేసులో ఉండే సీనియర్ ఆశావహుల్లో సీఎం ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డి, ఢిల్లీలో అధికార ప్రతినిధి టీబీ జయచంద్ర, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీఆర్ పాటిల్, ఎన్‌వై గోపాలకృష్ణ, ఎం కృష్ణప్ప, లక్ష్మణసవది, తన్వీర్‌సేట్, పుట్టరంగశెట్టితోపాటు మంత్రి పదవి కోల్పోయిన బీ నాగేంద్ర ఉన్నారు. ఇక సీనియర్ ఎమ్మెల్యేల కోటాలో అప్పాజీనాడగౌడ, రఘుమూర్తి, కేఎం శివలింగేగౌడ, యశ్వంతరాయగౌడ, పంపనగౌడ బాదర్లి, బీకే సంగమేశ్వర్, మహంతేశ కౌజలగి, కేవై నంజేగౌడ, ఎన్ఏ హారిస్‌తోపాటు పరిషత్ సభ్యులు సలీం అహ్మద్, బీకే హరిప్రసాద్, ప్రకాశ్ హుక్కేరి ఉన్నారు.

హాజరుకానున్న ప్రముఖులు

కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ డీసీఎంగా, బెంగళూరు అభివృద్ధి శాఖ, జలవనరులశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఇలా కీలకమైన హోదాలలో కొనసాగుతున్న డీకే శివకుమార్‌ను కేపీసీసీ పదవి నుంచి మార్పు చేయాలనే ప్రస్తావన జోరందుకుంది. అదే జరిగితే ఈశ్వర్‌ఖండ్రె కేపీసీసీ సారథి అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉండే బీ నాగేంద్ర, మంత్రి ఈశ్వర్‌ఖండ్రెను తొలగించి మరో 8మందికి ఉద్వాసన తెలిపి కనీసం పదిమంది కొత్తమంత్రులను నియమించాలనే చర్చలు ఉన్నాయి. ఇలా మంత్రివర్గ విస్తరణ అంశం రాష్ట్రంలో హాట్‌టాపిక్ అవుతోంది. ఈనెల 20తో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కానుంది. రెండేళ్ల పాలన విజయోత్సవాలను సాధన పేరిట విజయనగర్ జిల్లాలో నిర్వహించదలిచారు. ఇప్పటికే ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ సమావేశంలో కనీసం లక్షమందికి ఇంటి పట్టాలతోపాటు శాశ్వతమైన భూరికార్డులు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ సంబరానికి లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలువురు పాల్గొంటున్నారు. ఇదే సమయంలో కేబినెట్ మార్పు అంశాన్ని పరిష్కరించే అవకాశాలు ఉన్నాయి.

అక్రమ మైనింగ్‌లో దోషులందరినీ శిక్షించాలి

- 'గాలి'పై మా పోరాటం ఫలించింది
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావాలకు వ్యతిరేకిని : సీఎం

బళ్లారి, మే 16(ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వారందరికీ శిక్ష పడాలని, ప్రజల సొమ్ము దోచుకున్నవారిని వదిలి పెట్టరాదని ముఖ్య మంత్రి సిద్దరామయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన సందర్భంగా విజయనగర జిల్లా హొస్పేట్‌లో ఈ నెల 20న విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఏర్పాట్లు పరిశీలించడానికి శుక్రవారం సీఎం హొస్పేకు వచ్చారు. ఈ సందర్భంగా సీఎం విలేకరులతో మాట్లాడారు. గాలి జనార్దన్‌రెడ్డి బళ్లారి గనుల్లో అక్రమాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఆధ్వర్యంలో బెంగళూరు నుంచి బళ్లారికి 2013లో పాదయాత్ర చేశామన్నారు. బీజేపీ గాలికే మద్దతు ఇచ్చిందని, మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరినీ శిక్షించాలన్నారు. తాను బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావాలకు వ్యతిరేకినన్నారు. గాలి జనార్దన్‌రెడ్డి గంగావతిలో విజయానికి మీరు సహకరించారని ప్రశ్నించగా ఆయన అవినీతిపై పోరాడిన తాను ఆయనకు ఎలా సహకరిస్తానన్నారు.

పరిపాలనా దృక్పథంతోనే 'గ్రేటర్'

పరిపాలనా దృక్పథంతో ఆలోచించే గ్రేటర్ బెంగళూరులో మున్సిపల్ కార్పొరేషన్లు పెంచే ఆలోచనలో ఉన్నామన్నారు. బెంగళూరు గ్రేటర్‌లో ఒకటిన్నర కోటి జనాభా ఉంది. ఇందుకు ఒకే నగర పరిపాలను ఒకే మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా నిర్వహించడం కష్టమన్నారు. పెరిగిన జనాభా దృష్ట్యా మూడు, నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని భావించామన్నారు. ప్రతిపక్ష నాయకడు ఆర్ అశోక్ కూడా ఇదే విజ్ఞప్తి చేశారన్నారు. గతంలో బీజేపీ అధికారంలో ఉన్న సమయంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సురేష్ కూమార్ ఉన్నప్పుడు కూడా ఈ ప్రతిపాదన తెచ్చారని, అందుకు పరిపాలనా దృష్టిలో గ్రేటర్ బెంగళూరులో మూడు అంతకన్నా ఎక్కవ మున్సిపాల్టీలు ఏర్పాటు చేయాలనుకున్నట్లు సీఎం అన్నారు.

'బల్డోట'పై నివేదిక ఇవ్వండి: సీఎం

కొప్పళ జిల్లా బల్డోట ఉక్కు కర్మాగారంపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని కొప్పళ జిల్లా కలెక్టర్‌కు సీఎం సిద్దరామయ్య సూచించారు. బల్డోటా కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా పనులు సాగిస్తుందని ఫిర్యాదులు అందాయన్నారు. కంపెనీ కార్యాకలాపాలను నిలిపి వేయాలని ఆదేశించామన్నారు. కానీ సీఎం మాట లెక్కచేయకుండా కంపెనీ కొనసాగిస్తోందన్నారు. పూర్తి నివేదిక ఇవ్వాలని డీసీని ఆదేశించారు. ప్రభుత్వం గ్యారెంటీ పథకాల అమలు చేసేందుకు ప్రభుత్వ ఖజానా లో లోటు ఏర్పడిందని అని ప్రశ్నించగా అలాంటిదేమీ లేదని నిధులు పుష్కలంగా ఉన్నాయని దాటవేశారు. విజయనగర జిల్లా హొస్పేట్‌లో ఈనెల 20 జరిగే ప్రభుత్వ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, వివిధ రాష్ట్రాల నుంచి అనేక మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, సుమారు 3 లక్షల మంది కార్యకర్తలు ప్రజలు హజరవుతారని సీఎం తెలిపారు. హొస్పేట్‌లో చక్కెర పరిశ్రమను తిరిగి పునఃప్రారంభిస్తామన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రి హెచ్‌కే పాటిల్, జమీర్ అమ్మద్, ఎమ్మెల్యే గవియప్ప, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య



ఇంటర్వ్యూలో దొరికిపోయింది..!

- భార్య తొలి వివాహన్ని వెలుగులోకి తెచ్చిన టెకీ.. ఆపై విడాకులు

బెంగళూరు, మే 16(ఆంధ్రజ్యోతి): భర్తకు తెలియకుండా పక్కాగా తన తొలి వివాహం గురించి దాచిపెట్టింది. నాలుగేళ్లుగా అనుమానం రాకుండా కాపురం చేసింది. భర్త తెలివిగా చేసిన జూమ్ ఇంటర్వ్యూలో దొరికిపోయింది. భార్య తొలి వివాహన్ని వెలుగులోకి తెచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆపై విడాకులు ఇచ్చారు. భార్య తొలి వివాహన్ని దాచిపెట్టినట్లు అనుమానంతో సాంకేతికంగానే తెలుసుకున్న సంఘటన దక్షిణకన్నడ జిల్లాలో చోటు చేసుకుంది. బంట్వాళకు చెందిన ఓ యువతిని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పెళ్లి చేసుకున్నాడు. ఆమెకు అంతకుముందే వివాహమైన విషయాన్ని రహస్యంగా ఉంచారు. అనుమానం వచ్చాక భర్త నాలుగేళ్లపాటు పోరాటం చేసి సమగ్రమైన ఆధారాలను కోర్టుకు సమర్పించారు. ద్రోహం చేశారని రుజువు చేసి చట్టబద్ధంగా విడాకులు పొందారు. బంట్వాళకు చెందిన యువతిని వివాహం చేసుకున్న తర్వాత ఆమెపై అనుమానం కలిగింది. నువ్వు ఎందుకు ఉద్యోగం చేయరాదని, ఇంటర్వ్యూకు అటెండ్ అయితే ఉద్యోగం వస్తుందని నమ్మించారు. పైగా ఆఫీస్‌కు వెళ్లాల్సిన పనిలేదని జూమ్ మీటింగ్‌లోనే ఇంటర్వ్యూలో పాల్గొనాలని నమ్మించాడు. ముందస్తుగా నిర్ణయించుకున్నట్లు నిఘా పెట్టాడు. అపరిచితుడి తరహాలో హెచ్‌ఆర్ మేనేజర్‌గా భర్త పరిచయం చేసుకున్నాడు. చదువుతోపాటు సొంత ప్రాంతం, ఉద్యోగంలో అనుభవం, కంప్యూటర్ కోర్సులలో అవగాహన వంటి ప్రశ్నలు వేశారు. మాటల్లో ఆమె తొలి వివాహం విషయాన్ని ఆరాతీశారు. ఆమె పెళ్లి చేసుకున్న విషయాన్ని స్పష్టంగా వివరించింది. సదరు వీడియోలను కోర్టుకు సమర్పించారు. దీంతో విడాకులు పొందారు.

28 వరకు ఎస్సీ, ఎస్టీ సర్వే పొడిగింపు

- ఎస్సీ వర్గీకరణ చైర్మన్ జస్టిస్ నాగమోహన్‌దాస్

బెంగళూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సర్వేను ఈనెల 28వరకు గడువు పెంచినట్లు వర్గీకరణ కమిషన్ చైర్మన్, జస్టిస్ నాగమోహన్‌దాస్ వెల్లడించారు. నగరంలో శుక్రవారం విధానసౌధలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సర్వే సమగ్రంగా పూర్తి కానందున మరో పది రోజులు పొడిగించామన్నారు. ఈనెల 5న సర్వే ప్రారంభమైందన్నారు. ఇంటింటా సర్వే ఇంకా జరగాల్సి ఉన్నందున ఈనెల 25వరకు పొడిగించామన్నారు. ఆ తర్వాత 26నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక శిబిరాల ద్వారా బ్లాక్‌లవారీగా పర్యవేక్షిస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా సొంతంగా దరఖాస్తు చేసుకునేవారికి ఈనెల 19నుంచి 28 వరకు గడువు ఉంటుందని అన్నారు.



మీడియా సమావేశంలో మాజీ జస్టిస్ నాగమోహన్‌దాస్

పెళ్లింటికి చల్లటి కబురు..!



అరెస్టు చేసిన నిందితుడితో పోలీసులు, స్వాధీనం చేసకున్న నగలు

- కూతురి పెళ్లికి దాచిన బంగారం చోరీ
- కువైట్‌లో 20 ఏళ్లు కష్టపడి సంపాదించిన తండ్రి
- గతనెల 30న రాయచోటిలోని ఇంట్లో చొరబడ్డ దొంగ
- కణేకల్లు పోలీసులకు దొరికిన వైనం
- బాధితులకు కబురుపెట్టిన పోలీసులు

అనంతపురం క్రైం/రాయదుర్గం, మే 16(ఆంధ్రజ్యోతి): కుటుంబం కోసం అతను కువైట్ వెళ్లాడు. భార్య, పిల్లలకు దూరంగా 20 ఏళ్లకు పైగా గడిపాడు. కొవిడ్ సమయంలో భార్య, కొడుకు మృతిచెందారు. దీంతో అతను స్వదేశానికి తిరిగొచ్చాడు. తనకంటూ మిగిలిన ఒక్కగానొక్క కూతురు వివాహానికి ఏర్పాట్లు చేస్తున్నాడు. అప్పటి వరకూ కష్టపడి సంపాదించిన సొమ్ముతో కొన్న బంగారాన్ని తాకట్టు నుంచి విడిపించాడు. ఇంకో నెలలో పెళ్లి జరగాల్సి ఉండగా.. ఇంట్లో దొంగపడి బంగారాన్ని దోచుకుపోయాడు. దీంతో ఆ తండ్రి హతాశుడయ్యాడు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ తండ్రికి పోలీసులు చల్లటి కబురు అందించారు. 'ఒక దొంగను పట్టుకున్నాం. రికవరీ చేసిన బంగారంలో మీరు పోగొట్టుకున్నదీ ఉంది..' అన్నారు. అంతే.. ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

ఇంతకూ ఏమిటా కథ..?

అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన విజయ్ భాస్కర్, క్రిష్ణవేణి దంపతులకు సాయి ప్రతాప్ నాయుడు, ప్రీతి సంతానం. ఆర్థిక ఇబ్బందుల కారణంగా 20 ఏళ్ల క్రితం విజయ్ భాస్కర్ కువైట్‌కు వెళ్లారు. అక్కడ రేయింబవళ్లు కష్టపడి సంపాదించిన సొమ్మును ప్రతి నెలా కుటుంబ సభ్యులకు డబ్బు పంపేవాడు. కొవిడ్ సమయంలో, 2021లో భార్య క్రిష్ణవేణి, కుమారుడు ప్రతాప్ మృతి చెందారు. దీంతో విజయ్‌భాస్కర్ రాయచోటికి తిరిగి వచ్చారు. కూతురుకు పెళ్లి కుదరడంతో బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను రెండు నెలల క్రితం ఇంటికి తీసుకొచ్చారు. మరో నెల రోజుల్లో పెళ్లి ఉండటంతో ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో గత నెల 30న విజయ భాస్కర్‌కు కంటి వైద్యం చేయించేందుకు కూతురు ప్రీతి వైద్యుడి వద్దకు తీసుకెళ్లింది. వారు తిరిగి వచ్చేలోగా ఇంట్లో చోరీ జరిగింది. మొత్తం 31 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకుపోయారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా కణేకల్లు పోలీసులు పీట్ల గంగాధర్ అలియాస్ సాంబ అనే అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేశారు. అతన్నుంచి 45.5 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అందులో విజయ్ భాస్కర్ ఇంట్లో చోరీ చేసిన 31 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఈ విషయాన్ని పోలీసులు బాధిత కుటుంబానికి తెలియజేశారు. ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయింది.

సామాన్యుడు కాదు..



పీట్ల గంగాధర్ వివిధ రాష్ట్రాల్లో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేశాడని కణేకల్లు సీఐ వెంకటరమణ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఐలు నాగమధు, నబీరసూల్‌తో కలిసి ఆయన ఈ కేసు వివరాలను తెలిపారు. కణేకల్లు క్రాస్ వద్ద అతన్ని శుక్రవారం అరెస్టు చేసి, రూ.48 లక్షల విలువచేసే 45.5 తులాల బంగారు నగలు, 2.27 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన పీట్ల గంగాధర్, క్రికెట్ బెట్టింగ్, జూదానికి బానిసయ్యాడు. జల్సాలకు అలవాటుపడ్డాడు. డబ్బులకోసం చోరీలు చేసేవాడు. రాయదుర్గం, రాప్తాడు, గోరంట్ల, గాండ్లపెంట, బ్రహ్మసముద్రం, అనంతపురం, ఉరవకొండ, విడపనకల్లు, డోన్, పులివెందుల, రాయచోటి, తెలంగాణలోని వికారాబాద్, కొత్తకోట, ఆమనగల్లు, షాద్‌నగర్, కర్ణాటకలోని జగలూరు, బళ్లారి ప్రాంతాల్లో ఇతడిపై చోరీ కేసులు ఉన్నాయి. మొత్తం 40 కేసుల్లో నిందితుడు. కణేకల్లు క్రాస్‌లో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేస్తుండగా.. గంగాధర్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని విచారించగా అంతర్రాష్ట్ర దొంగ అని తేలింది.

రైల్వేలైన్ మార్చాలని రైతుల ఆందోళన

దేశ రక్షణకు కదిలిన సైనికులు

8

'కెనరా ట్రూ ఎడ్జ్' సేవలు ప్రారంభం

- ఎస్‌బీ, కరెంట్ అకౌంట్ మరింత సులభతరం

బెంగళూరు, మే 16(ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు ఖాతాదారులకు మరింత చేరువ అయ్యేలా సేవింగ్స్, కరెంట్ అకౌంట్‌లను సులభంగా తెరుచుకునేందుకు 'కెనరా ట్రూ ఎడ్జ్' సేవలను లాంఛనంగా ప్రారంభించింది. 'నమ్మకంతో ఎదగండి - ఎడ్జ్‌తో సాగండి' పేరిట కొత్త విధానాన్ని పరిచయం చేస్తోంది. నమ్మకమైన సంస్థలకు అవసరమైన రీతిలో అకౌంట్‌ను పర్యవేక్షించుకునే వీలుంటుందన్నారు. స్థిరమైన డిపాజిట్లతోపాటు దీర్ఘకాలమైన బ్యాంకింగ్ సేవలు కొనసాగించేలా ఖాతాదారులకు విశిష్టమైన సేవలు అందిస్తోందన్నారు. హెల్త్‌కేర్, ఎడ్యుకేషన్, ఆధ్యాత్మిక సంస్థలతోపాటు వ్యక్తిగత, ఇతరత్రా ఖాతాలకు అనువైన సేవలు అందిస్తున్నట్లు ప్రకటించారు. జీరోబ్యాలెన్స్‌తో ఖాతాలను తెరుచుకునేందుకు వీలుందని, అన్ని ఇన్‌స్టిట్యూషన్‌లకు ఫండింగ్, ఇతరత్రా ప్రాసెస్‌ను సులభంగా అందిస్తామన్నారు. డైనమిక్ 5టైర్ ఎంఏబీ స్ట్రక్చర్ కింద నెలసరి కనీస నిల్వను రూ.49వేల నుంచి 10లక్షలదాకా ఉంటే వారికి అనుగుణమైన లావాదేవీలకు వెసలుబాటు ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ ఎకోసిస్టమ్ సొల్యూషన్స్, సిగ్నిఫిఫియంట్ చార్జ్ వైవర్స్ అండ్ కన్సెషన్, డెడికేటెడ్ రిలేషన్‌షిప్ మేనేజర్, కాంప్లిమెంటరీ ప్రీమియం డెబిట్‌కార్డులు, విద్యాసంస్థలకు ప్రీకోర్స్ లైసెన్స్‌లు, కోర్సెరా, ఫ్రీ డిజిటల్ బ్యాంకింగ్, పాన్ ఇండియా యాక్సెసిబిలిటీ వంటిసేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు.

ఈడీ మాజీ అధికారిపై ఎఫ్ఐఆర్

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): వంచనకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మాజీ అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు నలుగురిపై పీణ్యాపోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. జాలహళ్ళి నివాసి సుహాస్ ఫిర్యాదు చేశారు. వాపె ఇంజనీరింగ్స్ డైరెక్టర్ నిరంజన్ ఎస్ మయూర్, అతడి తండ్రి మాజీ ఈడీ అధికారి సోమశేఖర్, ఎల్ఎల్ఎన్ సీఎన్‌సీటీ టెక్ డైరెక్టర్ అశోక్, వాపె ఇంజనీరింగ్ డైరెక్టర్ ఎంఏ కార్తీక్‌లపై కేసు నమోదైంది. సోమశేఖర్ కుమారుడు నిరంజన్ మయూర్ కంపెనీ నగదును ఆస్తిని దుర్వినియోగం చేశారని మార్కెటింగ్ డైరెక్టర్‌గా కొనసాగినట్టు సుహాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు. సంస్థ పర్యవేక్షణ పూర్తిగా సోమశేఖర్ వద్దనే ఉండేదన్నారు. ఈడీలో కొనసాగుతున్నందున నేరుగా పాల్గొనకుండా కుమారుడి ద్వారా కార్యకలాపాలు చేసేవారన్నారు. 2021 డిసెంబరు నుంచి 2023 దాకా వరకు వాపె ఇంజనీరింగ్ సంస్థ నుంచి అశోక్ యంత్రాలను కొనుగోలు చేసి ఏరోస్పేస్ ఉత్పత్తులకోసం 2.15 కోట్ల రూపాయలు బదిలీ చేశారన్నారు. అయితే సంబంధిత యంత్రాలు కంపెనీకి చేరలేదని, కోట్లాది రూపాయలు మోసం చేశారన్నారు. ఇదే విషయాన్ని ప్రశ్నించినందుకు బెదరించి ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకున్నారని, బినామీ కంపెనీతో పేర్లు పెట్టి వాపె సంస్థకు రూ.80లక్షలు నష్టం చేశారన్నారు. సోమశేఖర్ ఈడీలో పనిచేశారా అనే కోణంలోనూ సమగ్ర దర్యాప్తు చేయాలని కోరినట్టు సమాచారం.

ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ

పరిష్కరిస్తాం: మంత్రి నారా లోకేశ్


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న మహిళలు

గుత్తి, మే 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అనంతపురం రోడ్డులో రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతులు వెల్లువెత్తాయి. మండలంలోని ధర్మాపురం గ్రామానికి రోడ్డు గుంతలమయమైందనీ, కొత్తగా నిర్మించాలని మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చౌదరి కోరారు. గుంతకల్లు పట్టణానికి చెందిన గోరంట్ల నాగరాజు 2024లో రోడ్డు ప్రమాదంలో వెన్నెముక డిస్క్‌లు విరిగి, శరీరం స్పర్శ లేకుండా పోయి, కాళ్లు, చేతులు పనిచేయక బెంగళూరులో రూ.18 లక్షలదాకా ఖర్చు చేశామన్నారు. అయినా నయం కాలేదనీ, వైద్యానికి, మందులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు నారా లోకేశ్ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్థికంగా ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. సీఎం రిలీఫ్ ఫండ్ అందించాలని విన్నవించారు. వంశపారంపర్యంగా సక్రమించిన భూమిని కబ్జాదారులు ఆక్రమించారని, తనకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన రంగనాయకులు కోరారు. గుంతకల్లు మండలం నెలగొండ గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.16 లక్షలు స్వాహా చేశారని సింగాడి శ్రీనివాసులు.. మంత్రికి ఫిర్యాదు చేశాడు. పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, ఐటీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. గుంతకల్లు పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాలకు స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్.. మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ అమలు చేయాలనీ, సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలనీ, 9 రకాల పాఠశాలలను సవరించి పాత విద్యావిధానాన్ని అమలు చేయాలని ప్రతి పాఠశాలలో విద్యార్థులతో సంఖ్యతో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలనీ, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని మంత్రిని కోరారు. అనేక మంది బాధితులు.. తమ సమస్యలపై మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. వాటిని స్వీకరించిన మంత్రి లోకేశ్ పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్




రెన్యూ ఇండియా స్టోరీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు లోకేశ్, గొట్టిపాటి రవి, సంస్థ చైర్మన్ సుమంత్ సిన్హా, కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే జయరాం, సభలో ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేశ్, హాజరైన ప్రజలు, టీడీపీ నాయకులు

ఉద్యోగ కల్పనే రెన్యూ లక్ష్యం

- సీఎం చంద్రబాబుపై నమ్మకంతో ఏపీ వైపు కంపెనీల చూపు
- స్థానికంగా పదివేల మందికి ఉద్యోగావకాశాలు
- సోలార్ విద్యుత్ ప్రాజెక్టుతో కరెంటు చార్జీలు తగ్గిస్తాం
- 'రెన్యూ' ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్

గుంతకల్లు, మే16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ కల్పనే లక్ష్యంగా రెన్యూ హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టును తెచ్చామని విద్య, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. గుత్తి మండలం బేతాపల్లి వద్ద సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు మంత్రి శనివారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సు లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా ఉన్న 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగానే ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ సోలార్ విద్యుత్ ప్రాజెక్టులో రెన్యూ విద్యుత్ కంపెనీ రూ. 22,000 కోట్లు పెట్టుబడి పెడుతోందన్నారు. దీంతో అనంతపురం జిల్లాలో 10 వేల ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడిపై నమ్మకంతో ఇప్పుడిప్పుడే భారీ కంపెనీలు ఏపీ వైపు వస్తున్నాయన్నారు. గడచిన ఐదేళ్లలో ఒక్క మెగావాట్ విద్యుదుత్పత్తి సంస్థ, ఒక్క బ్యాటరీ స్టోరేజి సిస్టం వ్యవస్థ కూడా రాలేదన్నారు. ఇటువంటి పవర్ ప్రాజెక్టుల ద్వారా గత ప్రభుత్వ హయాంలో ప్రజలపై పడిన విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని రానున్న రోజుల్లో తగ్గిస్తామన్నారు. ఏపీలో ఉత్పత్తి చేయనున్న విద్యుత్ రానున్న రోజుల్లో యావత్ భారత దేశానికి ఉపయోగపడుతుందన్నారు. విజన్ ఉన్న నేత ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో హైబ్రిడ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టులాంటివి మరిన్ని రాష్ట్రానికి తెస్తామన్నారు. ప్రధాని కారణంగానే రాయలసీమకు పవర్ ప్రాజక్టు వచ్చిందని, త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీని రాయలసీమ గడ్డపైకి కూడా రప్పిస్తామన్నారు. గడచిన ఐదేళ్లలో రోడ్లు కాదు, రోడ్లపై పడిన గుంతలను కూడా పూడ్చలేకపోయారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే తాము అన్ని మార్గాలను అన్వేషించి పెట్టుబడులను తేవడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రాజెక్టుకు వ్యవసాయ భూములను ఇచ్చిన రైతులకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్ బాబు, లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, రాయల్ రామయ్య, వీరేశ్, చిప్పగిరి ప్రతాప్, పెంచలపాడు వెంకటేశులు పాల్గొన్నారు.


ఎక్స్‌కవేటర్‌తో పవర్ ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తున్న లోకేశ్

వెళ్లిపోయిన పెట్టుబడులు వెనక్కు వస్తున్నాయి

విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్



గత ఐదేళ్లలో వెనక్కు వెళ్లిపోయిన పెట్టుడిదారులందరూ తిరిగి ఏపీకి వస్తున్నారని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ ప్రాజెక్టు శంకుస్థాపనా సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్లే కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయన్నారు. రాయలసీమకు చెందిన జగన్ ఇక్కడి ప్రజలకు చేసిన మేలు ఒక్కటీ లేదన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన 11 నెలల్లోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నో కంపెనీలను రాష్ట్రానికి తెచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు.

రైతులు, యువతకు మేలు: ఎమ్మెల్యే గుమ్మనూరు



రెన్యూ సోలార్ విద్యుత్ ప్రాజెక్టు వల్ల స్థానిక యువత, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. బేతాపల్లి వద్ద ఏర్పాటుచేసిన హైబ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు శంకుస్థాపనా సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ ప్రాంతంలో మెట్ట భూములలో పంటలు పండితే ఎకరాకు రూ. 20 వేల నుంచి రూ. 25 వేలదాకా మాత్రమే రైతులకు మిగులుతోందన్నారు. అటువంటిది రెన్యూ విద్యుత్ కంపెనీ రైతులకు ఎకరాకు రూ.35 వేల లీజు చెల్లించడానికి ముందుకు వచ్చిందంటే అది అదృష్టమనే చెప్పాలన్నారు. ఈ ప్రాజెక్టు స్థాపన వల్ల స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

పవన, సోలార్ విద్యుదుత్పాదనకు ఏపీ అనుకూలం: సుమంత్ సిన్హా



పవన, సోలార్ విద్యుదుత్పాదనకు రాష్ట్రంలో అనువైన ప్రదేశాలు ఉన్నందుకే తాము ఇక్కడ ప్రాజెక్టును నిర్మించడానికి ముందుకు వచ్చామని రెన్యూ విద్యుత్ కంపెనీ చైర్మన్, సీఈఓ సుమంత్ సిన్హా పేర్కొన్నారు. ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెట్టుబడులకు ఏపీ అనుకూలమైన విధానాలను అనుసరిస్తోందని తెలిపారు. ట్రాన్స్‌మిషన్ కనెక్టివిటీ ఇక్కడ మెండుగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు చొరవ కారణంగానే తాము ఏపీ పట్ల సానుకూల దృక్పథంతో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చినట్లు తెలియజేశారు. 78.5 గిగావాట్ల సౌర విద్యుత్తు, 35 గిగా వాట్ల పవన విద్యుత్తు, 25 గిగా వాట్ అవర్ బ్యాటరీ శక్తి నిల్వను ఉత్పత్తి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రాజెక్టు నిర్మాణం చేయనున్నట్లు వివరించారు.


మంత్రి లోకేశ్‌తో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు..


లోకేశ్‌తో ముచ్చటిస్తున్న మంత్రి సవిత

పెళ్లిలో సందడి

అనంతపురం, మే16(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కూతురు శ్రీచరిత, ఆయన వియ్యంకుడు ముత్తినేని రాజగోపాల్ కుమారుడు రాహుల్ ఆదిత్య వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతపురం నగర శివారులో జరిగిన వివాహ వేడుకలకు బంధుమిత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రముఖులు, జిల్లా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు, టీడీపీ శ్రేణులు తరలివచ్చారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, శాసన సభ సభాపతి అయ్యన్నపాత్రుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, సవిత, అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ హాజరై.. నూతన దంపతులను ఆశీర్వదించారు. మాజీ మంత్రులు కామినేని శ్రీనివాసరావు, అమర్‌నాథ రెడ్డి, పల్లె రఘునాథ రెడ్డి, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, ఎంఎస్ రాజు, గుమ్మనూరు జయరాం, కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, టీడీపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, ముఖ్యనేతలు ఎద్దుల సుబ్రహ్మణ్యం, తలారి ఆదినారాయణ, గౌస్‌మొద్దీన్, స్వరూప తదితరులు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.


నూతన దంపతులు, వారి కుటుంబ సభ్యులతో మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే గుమ్మనూరు, ఎంపీ బీకే


విద్యుద్దీప వెలుగుల్లో ఎన్టీఆర్ ఆడిటోరియం


ఆడిటోరియం లోపల ఏర్పాట్లు



స్నాతకోత్సవ రిహార్సల్స్

నేడే పట్టాల పండుగ

జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి సర్వం సిద్ధం
ముస్తాబైన ఎన్టీఆర్ ఆడిటోరియం
హాజరుకానున్న గవర్నర్

అనంతపురం సెంట్రల్, మే 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ 14వ స్నాతకోత్సవం శనివారం అట్టహాసంగా నిర్వహించనున్నారు. వేడుకలకు వర్సిటీ చాన్సిలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. స్నాతకోత్సవంలో విద్యార్థులకు బంగారు పతకాలు, పట్టాలను గవర్నర్ ప్రదానం చేస్తారు. వీసీ సుదర్శనరావు, వర్సిటీ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, వైద్య శాఖల అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. స్నాతకోత్సవానికి వేదికైన ఎన్టీఆర్ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం కాన్వకేషన్ రిహార్సల్స్ నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభంకానున్నాయి.

40,109 మందికి పట్టాలు

జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవంలో 40,109 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నట్లు వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, అకడమిక్, ఆడిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్‌తో కలిసి వీసీ వివరాలు వెల్లడించారు. బీటెక్, బీఫార్మసీ పూర్తిచేసిన 30,017 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను అందజేస్తామన్నారు.

ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ పూర్తిచేసిన 9,564 మందికి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు, 361 మందికి ఫార్మా-డి పట్టాలను అందజేస్తామన్నారు. 167 మందికి పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేస్తామన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో కోర్సులు పూర్తి చేసి ప్రతిభ కనబరచిన డిగ్రీ విద్యార్థులకు 40, పీజీ విద్యార్థికి ఒకటి మొత్తం 41 గోల్డ్ మెడల్స్ అందజేస్తామన్నారు. అనంతపురం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి ఆరు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థిని సుప్రజ నాలుగు గోల్డ్‌మెడల్స్‌కు ఎంపికయ్యారన్నారు.

వర్సిటీ ముస్తాబు..

స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ హాజరవుతుండడంతో జేఎన్‌టీయూ పరిసరాలు ముస్తాబయ్యాయి. కలెక్టరేట్ వద్దనున్న వైజంక్షన్ రోడ్డు నుంచి జేఎన్‌టీయూ ప్రాంగణం వరకు చిన్మయ గ్రామ పంచాయతీ, నగరపాలక సంస్థ కార్మికులు శుభ్రంచేశారు. వైద్యసిబ్బంది మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పాట్లను చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో పదుల సంఖ్యలో పోలీసుసిబ్బంది భద్రత కల్పించనున్నారు. గవర్నర్‌కు స్వాగత ఏర్పాట్లు, సేదతీరేందుకు గెస్ట్ హౌస్ తదితర ప్రక్రియలను డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, రూరల్ మండల తహసీల్దార్ మోహన్‌కుమార్ పర్యవేక్షించారు.

ప్రధానిని కలిసేందుకు మంత్రి..

జేఎన్టీయూ స్నాతకోత్సవానికి గవర్నర్‌తోపాటు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, రియల్-టైమ్ గవర్నెన్స్ మంత్రి నారా లోకేశ్ పాల్గొనేందుకు జిల్లా యంత్రాంగం షెడ్యూల్‌ను ఖరారుచేసింది. దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలిసేందుకు మంత్రి లోకేశ్‌కు అపాయింట్‌మెంట్ సమాచారం అందడంతో.. ఆయన ఢిల్లీకి పయనమై వెళ్లారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

స్నాతకోత్సవం సాగేదిలా..

- ఉదయం 10 నుంచి 10.15 గంటల వరకు జేఎన్‌టీయూ వీసీ, పాలకమండలి సభ్యులు, రిజిస్ట్రార్, ప్రిన్సిపాళ్లు స్నాతకోత్సవ వేదిక వద్దకు చేరుకుని, అకడమిక్ రోబ్స్‌ను ధరిస్తారు.
- 10.25 నుంచి 10.48 గంటల వరకు గౌరవ డాక్టరేట్ గ్రహీత, ముఖ్య అతిథులతోపాటు చాన్సిలర్ అయిన రాష్ట్ర గవర్నర్‌కు వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు స్వాగతం పలుకుతారు. అనంతరం వారు అకడమిక్ రోబ్స్‌ను ధరిస్తారు.
- 10.50 నుంచి 10.57 వరకు గ్రూప్ ఫొటో దిగి, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను ఊరేగింపుగా వేదికపైకి తీసుకెళ్లి, జాతీయ గీతాన్ని ఆలపిస్తారు.
- 10.59 నుంచి 11.10 గంటల వరకు రాష్ట్ర గవర్నర్ స్నాతకోత్సవాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు స్వాగత ప్రసంగంచేసి, జేఎన్‌టీయూ అభివృద్ధి నివేదికలను సమర్పిస్తారు.
- 11.10 నుంచి 11.15 గంటల వరకు గౌరవ డాక్టరేట్‌కు ఎంపికైన డాక్టర్ సత్యనారాయణ ప్రసంగిస్తారు. అనంతరం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తారు.
- 11.15 నుంచి 11.30 గంటల వరకు విద్యార్థులకు బంగారు పతకాలు, డిగ్రీలను గవర్నర్ ప్రదానం చేస్తారు.
- 11.50 గంటల వరకు స్నాతకోత్సవ ముఖ్య అతిథిగా ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్ ప్రసంగిస్తారు.
- 12.05 గంటల వరకు చాన్సిలర్ హోదాలో గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారు. అనంతరం గవర్నర్‌కు జ్ఞాపిక అందజేసి, సత్కరిస్తారు.
- 12.13 గంటల వరకు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య ధన్యవాద తీర్మానం చేస్తారు. అనంతరం స్నాతకోత్సవ ముగింపునకు చాన్సిలర్ అబ్దుల్ నజీర్ అనుమతికోరుతూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ప్రసంగం చేస్తారు.
- 12.15 గంటల వరకు స్నాతకోత్సవానికి హాజరైన వారందరూ జాతీయ గీతాన్ని ఆలపిస్తారు.
- 12.15 గంటలకు గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ వేడుకల నుంచి నిష్క్రమిస్తారు.

పోలీసులు అలర్ట్..

ఎంపీపీ ఎన్నిక నేపథ్యం

గ్రామాల్లో విస్తృత తనిఖీలు


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్

రామగిరి, మే 16(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మండలంలో ఊరూరా కలియతిరుగుతూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 19వ తేదీన రామగిరి ఎంపీపీ ఎన్నిక నిర్వహించనుండడంతో పోలీసులు గ్రామాల్లో విస్తృత పర్యవేక్షణ చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గురువారం రాత్రి సీఐ శ్రీధర్ పేరూరు, కొత్తపల్లి, గంగంపల్లి తదితర గ్రామాల్లో విస్తృతంగా తిరిగారు. కొత్తపల్లిలో ఎంపీటీసీ-2 ఇంటికి తాళాలు వేసి ఉండటంతో గ్రామంలో ఆయన కలియతిరిగారు. అక్కడ వైసీపీకి చెందిన ఓ నాయకుడికి బెదిరింపులు వచ్చాయని తెలియడంతో ఆయనను కూడా విచారించారు. గ్రామస్థులతో సమావేశం ఏర్పాటుచేసి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని తెలిపారు. ఏ చిన్న సమస్య ఉన్నా.. గొడవ జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో రెచ్చగొట్టేలా ప్రవర్తించవద్దనీ, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసీపీ ఎంపీటీసీలున్న గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కేశ్. శంకరనారాయణ కాంచ్...

శాంతకుమారి (జయంతి)



అలనాటి గొప్ప నటీమణులలో ఒకరైన శాంతకుమారి 1920 మే 17న కడప జిల్లా ప్రొద్దుటూరులో జన్మించారు. అసలు పేరు వెల్లాల సుబ్బమ్మ. 1936లో 'శశిరేఖా పరిణయం' ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టి 250 సినిమాలలో నటించారు. దర్శకుడు పీ పుల్లయ్య సతీమణి. శాస్త్రీయ సంగీతంలోనూ, వయోలిన్‌లోనూ రాణించి 16వ యేటకే ఆలిండియా రేడియోలో ద్వారా గుర్తింపు పొందారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ వంటి ప్రముఖులతో నటించారు. సారంగధర, ధర్మపత్ని, కృష్ణప్రేమ, షావుకారు, జయభేరి, ప్రేమనగర్ తదితర సినిమాలు ఎంతో గుర్తింపునిచ్చాయి. సినిమాలలో నటించడం మానేసిన తర్వాత మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడే పాటలను రాసి, స్వరపరిచేవారు. రఘుపతి వెంకయ్య, కళా నీరాజన వంటి పురస్కారాలు పొందారు. 2006 జనవరి 17న కన్నుమూశారు.

పంకజ్ ఉదాస్ (జయంతి)



గజల్ గాయకుడిగా, నేపథ్య గాయకుడిగాను పేరొందిన పంకజ్ ఉదాస్ 1951 మే 17న గుజరాత్ రాష్ట్రం జెత్పూర్‌లో జన్మించారు. 50కుపైగా ఆల్బమ్స్ విడుదల చేశారు. 100కుపైగా ఆల్బమ్స్ రూపకల్పన చేశారు. ఉత్తమ గజల్ గాయకుడిగా కేఎల్ సైగల్ అవార్డు అందుకున్నారు. గాయకుడిగా 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 2006లో అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం నుంచి 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు. దాదాభాయ్ నౌరోజీ స్మారక పురస్కారం, ఇతర అవార్డులు పొందారు. 2024 ఫిబ్రవరి 26న కన్నుమూశారు.

బీఎస్ చంద్రశేఖర్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత భగవత్ సుబ్రమణ్య చంద్రశేఖర్ 1945 మే 17న మైసూరులో జన్మించారు. క్రికెట్‌లో లెగ్ స్పిన్నర్‌గా రాణించారు. చంద్రశేఖర్, ఈఏఎస్ ప్రసన్న, బిషన్‌సింగ్ బేడి, శ్రీనివాస వెంకట రాఘవన్‌లతో కలసి 'ఇండియన్ స్పిన్ క్వార్టెట్'గా పేరొందారు. 1964లో ఇంగ్లండ్‌పై జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో 4 వికెట్‌లు సాధించారు. 1971లో 38 పరుగులకు 6 వికెట్‌లు సాధించి గుర్తింపు ఉత్తమబౌలర్‌గా పేరొందారు. 16ఏళ్ల కెరీర్‌లో 58 టెస్ట్ మ్యాచ్‌లలో 242 వికెట్‌లు తీశారు. 1972లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. విజ్‌డెన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, అర్జున అవార్డు ఇతర పురస్కారాలు పొందారు.

బాగేపల్లిలో ఇందిరా క్యాంటీన్ ప్రారంభం

బాగేపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): బాగేపల్లి పురసభ ఆధ్వర్యంలో తహసీల్దార్ వసతిగృహం ఆవరణలో ఇందిరాక్యాంటీన్‌ను ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆకలితో ఎవరూ ఇబ్బంది పడరాదనే ఉద్దేశ్యంతో ఆకలిరహిత రాష్ట్రం కోసం 2016లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య హయాంలో ఇందిరా క్యాంటీన్‌కు బెంగళూరులో శ్రీకారం చుట్టారన్నారు. తద్వారా పేదలు, కార్మికులు, విద్యార్థులు, రైతులకు అనుకూలమైందన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశన్నంటిన తరుణంలో సామాన్యులకు అందుబాటులో నామమాత్రంగా రూ.5కే టిఫిన్, రూ.10కే భోజనాన్ని ఇందిరాక్యాంటీన్‌ల ద్వారా అందిస్తున్నారన్నారు. ప్రతిరోజూ ఉదయం టిఫిన్ 300మందికి, మధ్యాహ్నం, రాత్రి 300మందికి భోజనం సమకూరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారి పీఎన్ రవీంద్ర, యోజనా డైరెక్టర్ కే మాధవి, తహసీల్దార్ మనీషా మహేశ్‌పత్రి, పురసభ ముఖ్య అధికారి ఏ శ్రీనివాస్, పురసభ అధ్యక్షుడు ఏ శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు సుజాత నరసింహనాయుడు, సభ్యులు తదితరులు పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు

డెంగీ నియంత్రణపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ స్వామి తదితరులు

శిడ్లఘట్ట, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వరల్డ్ డెంగీ డేలో భాగంగా శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ బీఎన్ స్వామి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ దోమల ద్వారా డెంగీ జ్వరం సోకుతుందన్నారు. వర్షం ప్రారంభం కావడంతో దోమలబెడద ప్రారంభమైందని కావున ప్రజలు తమ చుట్టుపక్కల ప్రాంతాలను స్వచ్ఛంగా ఉంచుకోవాలని సూచించారు. తాలూకా పంచాయతీ ఈఓ హేమావతి మాట్లాడుతూ డెంగీ జ్వరం లక్షణాలు గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సలు పొందాలన్నారు. తీవ్రమైన జ్వరం, కంటి వెనుక నొప్పి, తీవ్రమైన ఒంటినొప్పులు డెంగీ జ్వరం లక్షణాలన్నారు. కార్యక్రమంలో తాలూకా ఆరోగ్య అధికారి దేవరాజ్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి జగదీశ్, ఆసుపత్రి పాలనా వైద్యాధికారి మనోహర్, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభకు పీడీఓ ఆలస్యం

బంగారపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కారహళ్ళి పంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేకసభకు నిర్ణీత సమయానికి పీడీఓ రాకపోవడంపై ఐదుగురు సభ్యులు సభను బహిష్కరించారు. ఆపై తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారికి ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ సభ్యుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉదయం 11గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. అయితే 11.40 గంటలైనా పీడీఓ హాజరు కాలేదు. ఫోన్ చేసినా స్వీకరించలేదు. అనంతరం ఆలస్యంగా వచ్చిన పీడీఓ మాట్లాడుతూ సౌజన్యంకోసం కూడా సభకు ఆహ్వానం లేదని ఆరోపించారు. కాగా సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పంచాయతీలో ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాగా 15వ ఆర్థికసంఘం నిధులను దుర్వినియోగం చేశారని, వెంటనే పీడీఓ వేణును బదిలీ చేయాలని ఈఓకు ఫిర్యాదు చేశారు. కాగా పీడీఓ వేణు మాట్లాడుతూ రాత్రి కురిసిన వర్షంతో నీటి సరఫరాలో సమస్య ఏర్పడ్డంతో 10గంటలకే వచ్చి అధ్యక్షుడు, కొంతమంది సభ్యులతో స్థలానికి వెళ్ళి పరిష్కరించి వచ్చానన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా జాప్యం చేయలేదన్నారు.



ఈఓకు ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ సభ్యులు

తాలూకాలో ర్యాండమ్ సర్వే



సర్వే తీరుపై ఆరా తీస్తున్న అధికారులు

బాగేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులవర్గీకరణ నేపథ్యంలో చేపట్టిన సర్వే పారదర్శకంగా కొనసాగుతున్నదా లేదా అని పరిశీలించేలా తాలూకాలో ర్యాండమ్ సర్వే చేపట్టారు. తాలూకాలోని 11 బూత్‌లలో ఒక్కో ఇన్‌చార్జ్‌ను నియమించారు. ఎస్సీ కుటుంబాలకు సంబంధించి సుమారు 10శాతం ఇళ్లను సందర్శించి సర్వే అంశాలపై పరిశీలిస్తున్నారు. సర్వే సిబ్బంది మీ ఇంటికి వచ్చారా..? ఫోటో తీసుకున్నారా? మీ నుంచి సంతకం తీసుకున్నారా..? మీనుంచి వివరాలు సేకరించారా అని అడిగారు. బూత్‌సంఖ్య 70లో సర్వే అధికారులు పర్యటించారు. కులగణనకు సంబంధించి రామసుబ్బమ్మ మాట్లాడుతూ ఈనెల 14నుంచి ర్యాండమ్ సర్వే జరుగుతోందన్నారు. ఇంటింటి సర్వే పారదర్శకంగా సాగుతోందా లేదా అనేది పర్యవేక్షించడమే ర్యాండమ్ సర్వే ఉద్దేశ్యమన్నారు.

కాంగ్రెస్‌ది ఓటు బ్యాంక్ రాజకీయం



మాట్లాడుతున్న ఎంపీ గోవింద కారజోళ

పావగడ, మే 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీది ఓటు బ్యాంకు కోసమే గ్యారెంటీ పథకాలను అమలు పరిచి ప్రజలను పరోక్షంగా నిలువుదోపిడీ చేస్తోందని చిత్రదుర్గం ఎంపీ గోవింద కారజోళ ఆరోపించారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అభివృద్ధికి 38వేల కోట్లు బడ్జెట్ అమలు చేసి వాటిలో కేవలం 8వేల కోట్లు మాత్రమే పథకాలకు వినియోగించి మిగిలినవన్నీ గ్యారెంటీ పథకాలకు మళ్లించేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 1960లో నెహ్రూ, ఇందిరాగాంధీ చైనా, పాకిస్తాన్‌లతో యుద్ధాలు జరిపినా నేరుగా ప్రధానమంత్రులే పెత్తనం పోషించే వారన్నారు. పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై ఇండియన్ ఆర్మీకి చెందిన సేవ యోధులకే ఆ బాధ్యత అప్పగించి విజయం సాధించిన ఘనత భారత సైనికులకే దక్కడం గర్వకారణమన్నారు. ఈ ఏడాది టెన్త్‌లో అనుకున్న మేరకు ఫలితాలు రాకపోవడం విద్యాశాఖపై విమర్శలకు గురిచేసిందన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు కొరతపై టీహెచ్‌ఓ డాక్టర్ బాబును అడిగి తెలుసుకున్నారు. ప్రగతి పరిశీలన సభలో పావగడ అభివృద్ధిపై చర్చించారు.

మతగ్రంథం దహనం..

బెళగావిలో భారీ నిరసన



బెళగావిలో భారీ నిరసన ఇలా...

బెంగళూరు, మే 16(ఆంధ్రజ్యోతి): బెళగావి తాలూకా సంతి బస్తివాడి గ్రామంలో ఇటీవల ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్‌ను దహనం చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం బెళగావిలో భారీ ర్యాలీ చేపట్టారు. వివిధ ముస్లిం సంఘాలు, నగర పరిధిలోని మసీదులనుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. కోర్టు ప్రాంగణం నుంచి కిత్తూరు రాణి చన్నమ్మ సర్కిల్ దాకా ర్యాలీ సాగింది. పవిత్రగ్రంధాన్ని కాల్చివేయడం సరికాదని మండిపడ్డారు. అల్లాహు అక్బర్, హిందూస్థాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు నగర వ్యాప్తంగా ముస్లిం వ్యాపారులు దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి మద్దతు ఇచ్చారు. నగరంవ్యాప్తంగా 144వ సెక్షన్ అమలు చేసి బందోబస్తు ఏర్పాటు చేశామని నగర పోలీస్ కమిషనర్ ఎడామార్టిన్ మార్బాన్యాంగ్ తెలిపారు. 3వేలమంది పోలీసులచే బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ వివాదంలో బెళగావి గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్‌ను సస్పెండ్ చేసినట్టు ప్రకటించారు. బస్తివాడి గ్రామంలో ఈద్గా గోపురం ధ్వంసం చేసిన నిందితులను గుర్తించడంలో సీఐ నిర్లక్ష్యం చేశారని సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఖురాన్‌ను చోరీ చేసి కాల్చివేశారన్నారు. ర్యాలీ కొనసాగుతున్న వేళ జిల్లాధికారి కార్యాలయం వద్ద కొందరు పోలీసులపై చెప్పులు, రాళ్లు విసిరారు. దీంతో పోలీసులు అక్కడనుంచి వాపసు పంపారు. ఎమ్మెల్యే ఆసిఫ్‌సేట్‌తోపాటు పలువురు ముస్లిం పెద్దలు జిల్లా అధికారికి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆసిఫ్‌సేట్ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం సంతెబస్తివాడిలో ఖురాన్‌ను కాల్చారన్నారు. నిందితులు ఎవరైనా కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని జిల్లా అధికారిని కోరామన్నారు. వారం రోజుల్లో నిందితులను అరెస్టు చేస్తామని పోలీసు అధికారులు ప్రకటించారు.

ఘనంగా గంగాదేవి జాతర

శిడ్లఘట్ట, మే 16(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మేలూరు గ్రామంలో పురాణ ప్రసిద్ధ గ్రామదేవత గంగాదేవి అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. అమ్మవారికి విశేషపూజలు, అలంకరణలు చేశారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామ బాలికలు, ముత్తైదువులు మహిళలు తలపై హారతిని పెట్టుకుని ఊరేగారు. దీపోత్సవంలో మేలూరు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. గ్రామం లోని చెంగలరాయరెడ్డి సర్కిల్ సహా ప్రముఖ రహదారులను అందంగా ముస్తాబు చేశారు. వివిధ కళాబృందాలు ఉత్సవంలో పాల్గొన్నాయి. గ్రామంలో ఎటుచూసినా సందడి నెలకొంది.



విశేష అలంకరణలో అమ్మవారు

కారు, బైక్ ఢీ - వ్యక్తికి తీవ్రగాయాలు

చింతామణి, మే 16(ఆంధ్రజ్యోతి): చింతామణి - బెంగళూరు రోడ్డుపై నాయింద్రహళ్ళి గేట్ సమీపాన గుర్తు తెలియని కారు, బైక్‌ను ఢీ కొన్న ఘటనలో ద్విచక్రవాహన చోదకుడి కుడికాలు విరిగిపోయింది. శుక్రవారం ఉదయం సుమారు 10.30 గంటలకు ప్రమాదం చోటు చేసుకుంది. సరిహద్దులోని అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు చెందిన వెంకట్ (30) కాలు కోల్పోయాడు. మొలకలచెరువు నుంచి బెంగళూరుకు తన బైక్‌పై వెళ్తుండగా కారు ఢీ కొంది. ప్రమాదం జరిగినవెంటనే కారును అక్కడే నిలిపి పరారయ్యాడు. ప్రమాదం తీవ్రతకు బైక్ పూర్తిగా దెబ్బతింది. ఘటనా స్థలాన్ని కైవార అవుట్‌పోస్ట్ పోలీసులు పరిశీలించారు. చింతామణి పట్టణం, తాలూకాలో వెంటనే అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో కోలారు తాలూకా క్యాలనూరు నుంచి అంబులెన్స్‌ను రప్పించి బాధితుడిని బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారకుడైన వ్యక్తికోసం గాలింపులు చేపట్టారు.

ఎత్తినహొళె నీటిని చెరువులకు తరలించండి

● సీఎం సిద్ధరామయ్యకు ఎమ్మెల్యే వెంకటేశ్ వినతి

పావగడ, మే 16(ఆంధ్రజ్యోతి): ఎత్తినహొళె పథకం నుంచి పావగడ తాలూకాలోని 23 చెరువులకు నీటిని తరలించేందుకు నిధులు కేటాయించాలని పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ఇప్పటికే ఈ నీటి తరలింపు ప్రాజెక్టుపై డీపీఆర్ తయారు చేసేందుకు చిన్నతరహా నీటి పారుదల శాఖ అధికారులకు సూచించినట్లు తెలిపారు. దీనిపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేతో ఈద్గా కమిటీ సభ్యుల భేటీ

సిరుగుప్ప, మే 16(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన ఈద్గా కబరస్థాన్ కమిటీ అధ్యక్షుడు చిటిగి మహమ్మద్ హుస్సేన్ సాబ్ 12 మంది సభ్యులు ఎమ్మెల్యే బీఎం నాగరాజును ఘనంగా సత్కరించారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో ఆయనను కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు అండే హుస్సేన్, నగరసభ సభ్యులు నజీర్, మొహిద్దీన్, పీరా హుస్సేనీ, ఇషాక్, చౌదరి, హారున్‌సాబ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంజునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బీఎం నాగరాజును సన్మానిస్తున్న ఈద్గా కబరస్థాన్ కమిటీ సభ్యులు

గంటలో దర్శనం అని చెప్పి..

ఉచిత క్యూలో పంపారు

● బెంగళూరుకు చెందిన వర్ష ట్రావెల్స్‌పై భక్తుల ఫిర్యాదు

తిరుమల, మే 16(ఆంధ్రజ్యోతి): ఒక ట్రావెల్స్ సంస్థ కేవలం గంటలోనే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కల్పిస్తామని చెప్పి తీసుకువచ్చి చివరకు ఉచిత దర్శనం క్యూలో పంపారని బెంగళూరుకు చెందిన భక్త బృందం ఆవేదన వ్యక్తం చేసింది. వారు తెలిపిన వివరాల ప్రకారం బెంగళూరుకు చెందిన వర్ష ట్రావెల్స్ అనే సంస్థ బెంగళూరుకు నుంచి తిరుమలకు రానుపోను, టిఫిన్, భోజనం, వసతి వంటి సౌకర్యాల కల్పన కోసం ఒక్కొక్కరి నుంచి రూ.3,600 తీసుకుంది. బస్సులో 36 మంది భక్తులు శుక్రవారం తిరుపతికి చేరుకున్నారు. వీరికి ఉదయం టిఫిన్ పెట్టించి జీపుల ద్వారా తిరుమలకు తీసుకువచ్చారు. వీరిని కృష్ణ తేజ సర్కిల్ వద్ద ఉచిత క్యూలైన్ దగ్గర వదిలిపెట్టారు. ట్రావెల్స్ ఇచ్చిన టికెట్‌లను అక్కడ విధుల్లో ఉన్న భద్రతా సిబ్బందికి భక్తులు చూపించగా ఇవి దర్శన టికెట్లు కాదని తేల్చిచెప్పారు. మీరు ఉచిత దర్శనం క్యూలైన్‌లోకి ప్రవేశిస్తే దాదాపు 10 గంటల తర్వాత దర్శనం అవుతుందని వివరించారు. దీంతో భక్తబృందం ఆగ్రహం వ్యక్తం చేసింది. గంటలోనే దర్శనం చేయిస్తామని ఇలా మోసం చేశారని కొందరు విజిలెన్స్ వారికి ఫిర్యాదు చేశారు. కేసును తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. అయితే ట్రావెల్స్ టికెట్‌పై 'ఫ్రీ దర్శనం' అని మాత్రమే రాసి ఉండటం గమనార్హం. ట్రావెల్స్ ప్రతినిధి భాస్కర్ మాట్లాడుతూ.. తాము ఉచిత దర్శనమనే చెప్పామని, ఎలాంటి ప్రత్యేక దర్శన టికెట్లు ఇస్తామని చెప్పలేదని పేర్కొన్నారు.



ట్రావెల్స్ ప్రతినిధులు ఇచ్చిన టికెట్లను చూపుతున్న బెంగుళూరు భక్తబృందం

అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ

సంఘటనా కార్యదర్శిగా డాక్టర్ కిశోర్



డాక్టర్ కిశోర్

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ సంఘటనా కార్యదర్శిగా ఆయుర్వేద వైద్యుడు సీఏ కిశోర్‌ను నియమించారు. మహాసభ అధ్యక్షుడు రఘునాథ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీకాంత్ బృందం ఈమేరకు శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ సంఘంలో 20ఏళ్లుగా వివిధ హోదాలలో పనిచేశానని, ప్రస్తుతం సంఘటనా కార్యదర్శిగా బాధ్యతలు దక్కడం సంతోషమన్నారు. బ్రాహ్మణ మహాసభకోసం నావంతు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. పలువురు ఆయనను అభినందించారు.

ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో

ఉచితంగా గ్రూప్స్ కోచింగ్

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఆర్యవైశ్య మహాసభ ద్వారా యూపీఎస్‌సీ గ్రూప్ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్టు అధ్యక్షుడు ఆర్‌పీ రవిశంకర్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహాసభ 116ఏళ్లుగా సమాజసేవలో పాల్గొంటోందన్నారు. 20కుపైగా పథకాల ద్వారా నెలవారీ 1800 కుటుంబాలకు సాయం చేస్తోందన్నారు. వాసవి అకాడమీ గ్రూప్స్ పరీక్షల్లో పాల్గొనేవారికి ఉచితంగా శిక్షణలు ఇవ్వనున్నామన్నారు. 2026 పరీక్షల్లో పాల్గొనేవారికి మాత్రమే అవకాశం అన్నారు. అన్ని తరగతులకు సంపూర్ణంగా శిక్షణలు ఉంటాయన్నారు. అన్నికులాలకు చెందినవారిని నిబంధనల ప్రకారం అడ్మిషన్లు చేసుకుంటామన్నారు. వాసవి అకాడమీ నిర్వహించే ప్రవేశపరీక్షలో తప్పని సరిగా ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందన్నారు. రెండు దశాబ్దాలకుపైగా కోచింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని, అనుభవజ్ఞులైన విద్యానిపుణులు తర్ఫీదు ఇస్తున్నారన్నారు. మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ద్వారా ప్రత్యేకమైన అవగాహనా సదస్సులు జరుపుతామని, 6నెలలపాటు కోచింగ్ ఉంటుందన్నారు. మరింత సమాచారం గాంధీనగర్ శేషాద్రిరోడ్డులోని కర్ణాటక ఆర్యవైశ్య మహాసభ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

సీబీఎస్ఈలో రాణించిన విద్యాలక్ష్మి విద్యార్థులు



టాపర్ విద్యార్థులు

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పది పరీక్షల ఫలితాలలో అంజనానగర్ బీఈఎల్ లే అవుట్ విద్యాలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. 73మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనగా 29మంది డిస్టింక్షన్, 23మంది ఫస్ట్‌క్లాస్, 21మంది సెకండ్‌క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. చందన ఎస్ 94శాతం మార్కులు, శిక్ష కేశన్ 90శాతం, శ్రేయ 89శాతం మార్కులు సాధించారు. విద్యాసంస్థ సెక్రటరీ మంగళా సిద్దలింగయ్య, ప్రిన్సిపాల్ సిద్దలింగయ్యలు ఉత్తమమార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

బాలుడి వెన్నుకు రోబోటిక్స్ చికిత్స

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల పసిప్రాయంలోనే వెన్ను సమస్య ఉందని తల్లి గుర్తించినా వివిధ కారణాలతో ఆపరేషన్ చేయించలేకపోయారు. ఇలా ఆరేళ్ల బాలుడు నడుం వంచి నడిచే పరిస్థితి ఏర్పడింది. స్కోలియోసిస్‌తో బాధపడుతున్న వారికి సాయం అందించే ఓ గ్రూప్ వీరికి సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. ఇలా మణిపాల్ ఆసుపత్రిలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, హెచ్‌ఓడీ, రోబోటిక్ స్పైన్ సర్జరీ పర్యవేక్షించే డాక్టర్ ఎస్ విద్యాధర నేతృత్వంలో ఈనెల 1న ఆపరేషన్ చేశారు. న్యూరో మానిటరింగ్ ద్వారా రోబోటిక్ టెక్నాలజీతో పెడికల్ స్క్రూలను అమర్చారు. 15 రోజుల వ్యవధిలోనే బాలుడి ఆరోగ్యం మెరుగైనట్టు డాక్టర్ తెలిపారు. రోబోటిక్స్ టెక్నాలజీతో ఇటీవల చేస్తున్న సర్జరీలు విజయవంతం అవుతున్నాయని అభిప్రాయపడ్డారు.

ఆర్మ్‌రెజ్లింగ్‌లో సత్తా చాటిన శ్రీధర్



కాంస్య పతకాలతో శ్రీధర్

దొమ్మసంద్ర, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ ఆర్మ్ రెజ్లింగ్ 22, 23వ ప్యారా ఏషియన్ ఆర్మ్ రెజ్లింగ్ 2025 చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 3నుంచి 11 వరకు ఢిల్లీలోని లీలాప్యాలెస్‌లో జరిగాయి. ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి దొమ్మసంద్ర గ్రామానికి చెందిన ఎస్ శ్రీధర్ రెండు కాంస్యపతకాలు సాధించారు. గురువారం గ్రామానికి చేరుకోగా గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. పోటీల్లో 20దేశాలనుంచి పాల్గొనగా కర్ణాటక నుంచి ముగ్గురు పాల్గొన్నారు. వీరిలో శ్రీధర్ 90 కిలోల విభాగంలో రెండు కాంస్యపతకాలు సాధించారు. ఆర్మ్‌రెజ్లింగ్ కర్ణాటక స్టేట్ సెక్రటరీ దీపక్‌సింగ్, కోచ్ శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు శ్రీధర్‌ను అభినందించారు.

ప్రమాదాలపై అవగాహన

కంప్లి, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని కుడితిని వద్ద కేపీసీఎల్‌లో పోలీసులకు ప్రమాదాలపై ఈడీ ఉదయ్‌కుమార్, డీవైఎస్పీ మల్లికార్జున అవగాహన కల్పించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉగ్రదాడులు జరిగినప్పుడు పోలీసులు, వైద్యులు, ఫైర్ స్టేషన్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఈడీ ఉదయ్‌కుమార్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.27	1,577.60
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,384	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	381	13
నీటి నిల్వ (టీఎంసీలు)	8.19	3.42



మంటల్లో కాలిపోతున్న బేకరీ

షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ దగ్ధం

● రూ.30 లక్షల ఆస్తి నష్టం

బళ్లారి సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కూడ్లిగి పట్టణంలోని హాసన్ బేకరీ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యింది. బేకరీ ఉత్పత్తులు, ఫ్రిజలు ఇతర పరికరాలు కాలిపోవడంతో రూ. 30లక్షల వరకు నష్టం వాటిల్లింది. బేకరీ యజమాని సచిన్ గురువారం రాత్రి బేకరిని యథావిదిగా మూసి వేశారు. అర్ధరాత్రి తర్వాత, భవనం యజమాని బాల్ రాజ్ వైర్లు కాలిపోతున్న వాసన వస్తోందని గమనించారు. అతను ఇంటి నుంచి బయటికి వచ్చేసరికి బేకరీ నుండి పొగలు రావడం గమనించారు. అది షార్ట్ సర్క్యూట్ అయి ఉండవచ్చని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. కూడ్లిగి అగ్నిమాపక దళం వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని లోపల ఎగసి పడుతున్న మంటలను ఆర్పేసింది. కూడ్లిగి అగ్నిమాపక స్టేసన్ అధికారి శరణబసవరెడ్డి కీలక సిబ్బంది రాజ్‌కుమార్, డ్రైవర్ మాలప్ప, సిబ్బంది రవికుమార్, సురేశ్, వీరేంద్ర, శివశంకర్ మంటలను అదుపు చేశారు. అప్పటికే బేకరీ లోపల ఉన్న సామగ్రి పూర్తిగా బూడిదైపోయింది. దాదాపు రూ.30లక్షల ఆస్తి నష్టం జరిగిందని బేకరీ యజమాని సచిన్ వాపోయారు.

వ్యక్తి దారుణ హత్య

● మృతుడు కర్నూలు జిల్లా వాసి

● ఉద్యోగార్థం వచ్చినట్లు సమాచారం



బసవన్న గౌడ (ఫైల్)

కంప్లి, మే 16(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాలోని కంప్లి పట్టణం సోమప్ప చెరువు గట్టు పై గురువారం రాత్రి దొడ్డ బసవన్న గౌడ (32) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యా డు. గుర్తు తెలియని వ్యక్తులు తలపై బండరాయితో కొట్టి హత మార్చారు. శుక్రవారం ఉదయం సోమప్ప చెరువు గట్టుపైకి వాకింగ్‌కు వచ్చినవారు గౌడ మృతదేహాన్ని చూసి కంప్లి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ ప్రసాద్ గోఖలే, సీఐ వాసుకుమార్ సిబ్బంది అక్కడికి చేరుకుని డాగ్ స్వాడ్‌తో పరిశీలించారు. కంప్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. మృతి చెందిన దొడ్డ బసవన్న గౌడమృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం బళ్లారి విమ్స్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దొడ్డ బసవన్న గౌడ ఆంధ్రలోని కర్నూలు జిల్లా ఆదోని తాలుకా నందిచాగి గ్రామానికి చెందినవారని తెలిసింది. పాఠశాలలో ఉపన్యాసకులుగా ఉద్యోగం సంపాదించేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితమే కంప్లి పట్టణం చుట్టుపక్కల వుండే పాఠశాలకు, కాలేజీలకు తన బయోడేటా అందజేసినట్లు తెలిసిందన్నారు. గౌడ మామ ఫిర్యాదు మేరకు కంప్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డెంగీపై ఆందోళన వద్దు..!

● జాగ్రత్తలు పాటిస్తే సురక్షితం : ఉప మేయర్ సుకుమ్



పోస్టర్లు విడుదల చేస్తున్న ఉపమేయర్ సుకుమ్, వైద్యాధికారులు

బళ్లారి సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): డెంగీ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరైన జాగ్రత్తలు పాటిస్తే సురక్షితంగా నయం చేయవచ్చని ఉపమేయర్ సుకుమ్ అన్నారు. శుక్రవారం డెంగీ నివారణ దినం సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీపై అవగాహన కల్పించడానికి మే 16న జాతీయ డెంగీ నివారణ దినాన్ని జరుపుకుంటావన్నారు. నగరంలోని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారుల హాల్లో శుక్రవారం నిర్వహించిన జాతీయ డెంగీ నివారణ వేడుకల్లో మున్సిపల్ కార్పోరేషన్‌లోని హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్ వైజర్లు, పౌరకార్మికులకు జిల్లాస్థాయి పునశ్చరణ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు మాట్లాడుతూ.. జిల్లా అంతటా డెంగీ జ్వరాలను ఎదుర్కోవడానికి, నియంత్రించడానికి ఆరోగ్య శాఖ చేస్తున్న నిరంతర ప్రయత్నాలకు ప్రజలు సహకరించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి మాట్లాడుతూ డెంగీ వ్యాధి ఈడీస్ దోమ కాటు ద్వారా సంక్రమించే వైరస్ అని, దోమల సంతానోత్పత్తిని అరికడితే వ్యాధిని నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా డెంగీ నియంత్రణ అందరి బాధ్యత అనే పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా డాక్టర్ అబ్దుల్లా, జిల్లాలెప్రసీ డాక్టర్ వీరేంద్రకుమార్, ఆర్‌సీహెచ్ ఆఫీసర్ హనుమంతప్ప, డాక్టర్ పూర్ణిమ కత్తిమణి, జిల్లాఆరోగ్య విద్య అధికారులు ఈశ్వర దాసప్ప, రవీంద్ర జినగా, మారిబసవనగౌడ, శకుంతల, హెల్త్‌ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో..

రక్తనాళాలు దెబ్బతిని రక్తం లీక్ అయినప్పుడు డెంగీ వ్యాపిస్తుందని, రక్తప్రవాహంలో గడ్డకట్టే కణాలు(ప్లేట్‌లెట్స్)సంఖ్య తగ్గుతుందని దీని వలన అంతర్గత రక్తస్రావం, అవయవ వైపల్యం, మరణం సంభవించవచ్చని అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భారతి అన్నారు. శుక్రవారం నిర్వహిస్తున్న డెంగీపై అవగాహన కార్యక్రమంలో ఆమె మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రాంభించి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలను నివారిస్తే డెంగీని అరికట్టవచ్చన్నారు. లార్వా సర్వేలు నిర్వహించడం, ఇంటిలోపల వెలుపల శుభ్రతను నిర్వహించడంపై వైద్య సిబ్బంది దృష్టి పెట్టాలన్నారు. క్షేత్ర ఆరోగ్య విద్య అధికారులు ఖుర్షీద్ బేగం,ఉషారాణి, మహిళా శిశుసంక్షేమ శాఖ సూపర్‌వైజర్ చాందీబాయి. సూపర్‌వైజర్ మరియమ్మ, ఎర్రమ్మ, చంద్రమ్మ, ఫార్మసీ అధికారిణి జలజాక్షి, ఆరోగ్య తనిఖీ అధికారిణి ఈరమ్మ, మహమ్మద్ ఆషాక్, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారి డాక్టర్ భారతి



మాజీ ఎంపీ దరూరు పుల్లయ్యకు నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

అనంతకు నీరందించిన మహనీయుడు

● విలువలతో కూడిన రాజకీయం చేశారు

● మాజీ ఎంపీ దరూరు పుల్లయ్యకు నివాళి అర్పించిన సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

బళ్లారి, మే 16(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య అనంతపురం జిల్లాకు తాగు, సాగు నీరు అందించేందుకు ఎనలేని కృషి చేసిన మహనీయుడని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శుక్రవారం బళ్లారిలోని దరూరు పుల్లయ్య నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సీపీఐ నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పుల్లయ్య తన జీవిత కాలంలో ఎప్పుడూ విలువలతో కూడిన రాజకీయం చేశారన్నారు. అనంతపురం జిల్లాకు పుల్లయ్య రెండు దపాలు ఎంపీగాను(కాంగ్రెస్ నుంచి) గెలుపొందారన్నారు. ఆయనతో పాటు సీపీఐ పార్టీ బళ్లారి జిల్లా కార్యదర్శి ఆదిమూర్తి. అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయకార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున, గోపాల్, మామక్రిష్ణ, కేశవరెడ్డి పాల్గొని పుల్లయ్య చిత్రపటానికి పుష్పమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి..



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సామాజిక కార్యకర్తలు

బళ్లారి సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): రామనగర జిల్లాలో 15ఏళ్ల మూగ, చెవిటి బాలికపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని సామాజిక కార్యకర్త సిద్దేశ్ ఊకూరు డిమాండ్ చేశారు. బళ్లారి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ ద్వారా ముఖ్యమంత్రికి వారు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువయ్యిందని, అత్యాచారాలు, హత్యలు పెరిగిపో యాయన్నారు. ప్రభుత్వం దోషులను శిక్షించడంలో విపలమవుతోందన్నారు. దీంతో మహిళలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఇకపై దోషులను కఠినంగా శిక్షిస్తేనే అత్యాచారాలకు అడ్డుకట్టు పడుతుందని, సీఎం ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి

● రైల్వే శాఖ సహాయ మంత్రి సోమణ్ణకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న జిల్లా పరిశ్రమల అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి

బళ్లారి సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): బళ్లారి, కల్యాణ కర్ణాటక భాగం రైల్వేను అభివృద్ధిపరచాలని. నిలిపివేసిన రైళ్లను పునఃప్రారంభించాలని కోరుతూ రైల్వే మంత్రి సోమణ్ణకు హస్‌పేట్ లో శుక్రవారం వాణిజ్య పరిశ్రమల సంస్థ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బళ్లారి మార్గంగా సంచరించి తాత్కాలికంగా నిలిపివేసిన 8రైళ్లను పునఃప్రారంభించాలన్నారు. బెళగాం-బళ్లారి-మునుగూరు, శివమొగ్గ-బళ్లారి-చెన్నై. కదిరిదేవనపల్లి, బళ్లారి తిరుపతి రైళ్లను తక్షణం ప్రారంభించాలన్నారు. దరోజీ గంగావతికి కొత్త మార్గం నిర్మించాలన్నారు. పేదలకు ఎంతో ఉపయోగపడే ప్యాసింజర్ రైళ్లను నిలిపివేయడం తగదని అన్నారు.



డీకే శివకుమార్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు

డీసీఎంకి ఘన స్వాగతం

బళ్లారి రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మైసూరు నుంచి హోస్పేటకు వచ్చారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జిందాల్ విమానాశ్రయంలో కాంగ్రెస్ నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. హోస్పేటలో కాంగ్రెస్ సంబరాల ఏర్పాట్లను ఆయన పరిశీలించనున్నారు. మంత్రి జమీర్ అహ్మద్ బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర, సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్, మేయర్ నందీష్, బళ్లారి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్, బగరు హుకుం అధ్యక్షులు సిద్దంపల్లి తిమ్మన్నగౌడ, కాంగ్రెస్ ప్రముఖులుశ్రీనాథ్, సుబ్బారాయుడు రాజేశ్వరి, సోము పలు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేలైన్ మార్చాలని రైతుల ఆందోళన

బళ్లారిరూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో రైల్వేలైన్ మార్చాలని చాగనూరు, సిరివర, కప్పగల్లు, శ్రీధర్ గడ్డ, బాలాజీ నగర్ క్యాంపు, కొలగల్లు, భైరదేవనహళ్లి, సోమసముద్రం, లక్ష్మీనగర్ క్యాంపు పలు గ్రామాల రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. కనకదుర్గమ్మ దేవస్థానం నుంచి లయన్ సర్కిల్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పలు గ్రామాల రైతులు మాట్లాడుతూ పొలాల్లో వరి పంట పెట్టుకుని కుటుంబాలను పోషిస్తున్నామని, ఇదే తమ జీవనాధారమన్నారు. అలాంటి చోట్ల రైల్వే లైన్లు వేస్తే భారీగా నష్టపోతామన్నారు. రైల్వే ట్రాక్ పనులు మరో మార్గాన రైల్వేలైన్ పనులు ప్రారంభించాలని కలెక్టర్‌కు మనవిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌గడ్డ గ్రామ పంచాయతీ అధ్యక్షుడు హనుమంతరెడ్డి రైతులు బసప్ప చంద్రప్ప, మల్లన్నగౌడ, వెంకారెడ్డి, కప్పగల్ సదాశివ, పక్కీరేష్, చిన్న సుంకన్న, బసవన్నగౌడ, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న రైతులు

రోడ్డుపై ధాన్యం ఆరబోయవద్దు: ఎస్ఐ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మరియమ్మ

కంప్లి, మే 16(ఆంధ్రజ్యోతి): రైతులు రోడ్డుకు అడ్డంగా వరిధాన్యం ఆరబోయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, కల్లాల్లో ధాన్యం ఆరబోసుకోవాలని క్రైం ఎస్ఐ కరియమ్మ సూచించారు. శుక్రవారం కురుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎమ్మిగనూరు గ్రామం పరిధిలో ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ధాన్యం రోడ్డుపై ఆరబోయడంతో దుమ్ము, ధూళి కారణంగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రైతులు గమనించాలన్నారు.

దేశ రక్షణకు కదిలిన సైనికులు



సరిహద్దుకు వెళ్తున్నకృష్ణ



నామకరణ సంబరాల్లో సంతోష్ (ఫైల్)

కంప్లి, మే 16(ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితి కారణంగా సైనికులు సెలువులు రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పలు శుభకార్యాలు, కుటుంబ సభ్యులు వద్దకు వచ్చిన జవాన్లు దేశసేవే లక్ష్యంగా సరిహద్దుకు బయల్దేరుతున్నారు. కంప్లి తాలుకా పరిధిలోని శంకర్ సింగ్ క్యాంపునకు చెందిన కృష్ణ సీఐఎస్ఎఫ్‌లో దేశ సైనికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. గత కొన్ని రోజుల క్రితం కొన్ని సెలవులు దొరకడంతో వెంటనే వారి గ్రామం చేరుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంతోషంగా గడిపారు. అధికారుల పిలుపుతో ఆయన విధుల్లోకి చేరడానికి బయల్దేరి వెళ్లారు. అలాగే విజయనగరం జిల్లా హగరి బొమ్మనహళ్లి తాలుకా పరిధిలోని మారబ్బీ గ్రామానికి చెందిన కవల పిల్లలు పుట్టడంతో ఇటీవలే నామకరణ మహోత్సవానికి వచ్చారు. సరిహద్దు పిలుపు రావడంతో దేశసేవకై తరలివెళ్లారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి

సిరుగుప్ప, మే 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ నీటికుంటలో ఈతకు వెళ్లి శుక్రవారం వీరేష్ (13) అనే బాలుడు మృతిచెందాడు. ఎస్ఐ పరశురాం తెలిపిన వివరాల మేరకు ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన వీరేష్ అనే బాలుడు ఈతకు వెళ్లి కాలుజారి పడటంతో ఊపిరాడక మృతి చెందాడు. అగ్నిమాపక అధికారి హుస్సేన్‌సాబ్, సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీశారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. సిరుగుప్ప పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం: కేఆర్ఎస్

సిరుగుప్ప, మే 16(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజాసమస్యలతో పోరాడుతామని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని కేఆర్ఎస్ పార్టీ తాలుకా సంఘటన కార్యదర్శి ఖాదర్ బాషా అన్నారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయం ముందు కేఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు, జనస్పందన అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజల నుంచి దరఖాస్తులను, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కేఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి కట్టే బసప్ప, సిరుగుప్ప తాలుకా కేఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మల్లయ్య, మహబూబ్ బాషా, మంజునాథ, గాదెలింగప్ప, యల్లప్ప, ముత్తన్న, శ్రీనివాస పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కేఆర్ఎస్ పార్టీ పదాధికారులు

హోసూరు జోన్



అదుపుతప్పిన ఉల్లి లారీ

హోసూరు, మే 16(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి హోసూరు మీదుగా దిండిగల్‌కు ఉల్లి లోడుతో వస్తున్న ఐషర్ లారీ నగరంలోని దర్గా పై ఓవర్‌పై అకస్మాత్తుగా అదుపుతప్పి బోల్తా పడింది. శుక్రవారం చోటు చేసుకున్న ఘటనలో ఉల్లిబస్తాలు కిందపడి చెల్లాచెదురయ్యాయి. గమనించిన స్థానిక ట్రాఫిక్ పోలీసులు వెంటనే వాహనరాకపోకలను నియంత్రించారు. పొక్లైనర్ ద్వారా ఉల్లిబస్తాలను తొలగించి ట్రాఫిక్‌కు వీలు కల్పించారు. ప్రమాదంలో గాయపడిన ఐచర్ లారీ డ్రైవర్, క్లీనర్‌లను హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

67 లీటర్ల కర్ణాటక మద్యం స్వాధీనం

హోసూరు, మే 16(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి తమిళనాడుకు కారులో మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని మధుగిరి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టీవీఎస్ చెక్ పోస్ట్ వద్ద గురువారం వాహన తనిఖీల వేళ కారులో 376 ప్యాకెట్ల మద్యాన్ని (67లీటర్లు) మద్యాన్ని గుర్తించారు. నిందితుడు ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మునిరాజ్ (31)గా గుర్తించారు. కారును, మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



స్వాధీనం చేసుకున్న మద్యం, కారు



భవనాన్ని ప్రారంభిస్తున్న అన్నాడీఎంకే నాయకుడు కేపీ మునిస్వామి

బహుళార్థ సాధక భవనం ప్రారంభం

కృష్ణగిరి రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): వేపనహళ్ళి నియోజకవర్గం శూలగిరి యూనియన్‌లోని పున్నకరం గ్రామంలో బహుళార్థసాధక భవనాన్ని అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేపీ మునిస్వామి లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే గ్రాంట్స్ కింద రూ.9.6లక్షలతో భవనాన్ని నిర్మించారు. భవనాన్ని లాంఛనంగా ప్రారంభించి రేషన్‌కార్డుదారులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. శూలగిరి పశ్చిమ యూనియన్ కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాదేశ్, నారాయణప్ప, రామన్, శ్రీనివాసన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగుపై అవగాహన

హోసూరు, మే 16(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంట సమగ్ర సాగుపై హోసూరులో ప్రత్యేక అవగాహనా శిబిరం నిర్వహించారు. వ్యవసాయశాఖ రాష్ట్రవిస్తరణ పథకం కింద సొక్కరనపల్లి, కొత్తపల్లి, సేవగానపల్లి గ్రామాల నుంచి 50మంది రైతులు పాల్గొన్నారు. రెండు రోజుల శిబిరం కోసం రైతులను తిండివనంలోని నూనెగింజ పరిశోధన సంస్థకు తీసుకెళ్లారు. డాక్టర్ తమిళవరసన్ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. డాక్టర్ సంజీవకుమార్ సూక్ష్మపోషకాల ప్రాముఖ్యతను, ద్రావణం పిచికారీ ఆవశ్యకతను వివరించారు. సకాలంలో కలుపు తొలగించాలని, సమగ్ర వ్యాధి నిర్వహణకు పాటించాల్సిన విధానాలు వివరించారు. ఆత్మ ప్రాజెక్టు జిల్లా టెక్నికల్ మేనేజర్ సుగుణ, అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి